# శ్రీ వేపచేదు విద్యా పీఠము

# Vepachedu Educational Foundation, Inc.

## మన సంస్కృతి

## Mana Sanskriti

## మేనరికము

*సౌజన్య, వేపచేదు శ్రీనివాసరావు*

మేనరికపు పెళ్ళిళ్ళు ఆంధ్రప్రదేశ్ కు చెందిన చాలా తెగలలోనూ, కులాలలోనూ; భారతదేశంలో కొన్ని దక్షిణాది ప్రాంతాలలోనూ విరివిగా జరుగుతూ వుంటాయి. మేనకోడలూ–మేనమామల మధ్య జరిగే పెళ్ళిళ్ళను కానీ, మేనత్తా–మేనమామల పిల్లలకు జరిగే పెళ్ళిళ్ళను కానీ మేనరికపు పెళ్ళిళ్ళు అంటారు. తురక యూదు ఫారశీ మొదలయిన మతాలలో కూడా ఈ విధమైన పెళ్ళిళ్ళు కొంచం వ్యత్యాసంతో జరుగుతుంటాయి. తురక మతములో– హిందూమతానికి చెందిన తెలుగు వారిలో లాగ కాకుండా–దాయాదులలో (జ్ఞాతులలో) అంటే పెద్దతండ్రుల / పినతండ్రుల, పెదతల్లుల/పినతల్లుల పిల్లల మధ్య వివాహాలను కూడా అమోదిస్తారు. అదే హిందూమతములో అయితే పినతండ్రుల / పినతల్లుల పిల్లలని అన్నా–చెల్లెళ్ళుగానూ, అక్కా–తమ్ముళ్ళుగానూ భావిస్తారు. హిందూమతానికి చెందిన తెలుగు వారు కేవలము మేనత్తా–మేనమామల పిల్లలకూ, మేనకోడళ్ళూ–మేనమామలకూ మాత్రమే పెళ్ళిళ్ళను అనుమతిస్తారు.

తెలుగు వారిలోలాగే యూదులలో కూడా మేనకోడళ్ళూ–మేనమామలకూ పెళ్ళిళ్ళను అనుమతిస్తారు. అంతే కాకుండా వారు అన్న–దమ్ముల పిల్లల పెళ్ళిళ్ళను కూడా అనుమతిస్తారు. ఫారశీ మతస్థులు కూడా మేనరికపు పెళ్ళిళ్ళను జరుపుతూ వుంటారు.

ఉత్తర భారతదేశంలో చాలా కులాలలోనూ, తెగలలోనూ మేనరికాన్ని అనుమతించరు! మరాఠీ జాతులలో మరాఠాలూ, కుంబీలు, మాలీలు, మహర్లు మొదలైన వారు మేనత్తా–మేనమామల పిల్లలకు పెళ్ళిళ్ళు చెయ్యడము సర్వ సాధారణ విషయమే. గోండ్లు మేనరికాన్ని 'దూధ్ లౌట్నా' (పాలను వెనక్కిచ్చేయడం) అని వ్యవహరిస్తారు. ఉత్తర, మధ్య భారత దేశానికి చెందిన మురియాలూ, భిల్లులూ కూడా ఇటువంటి మేనరికపు పెళ్ళిళ్ళు జరుపుతూ వుంటారు. తెలుగు వారిలో కొన్ని కులాలలోనూ, తెగలలోనూ; మహరాష్ట్రప్రదేశానికి చెందిన దేశస్థ బ్రాహ్మణులలోనూ పురుషుడికి పుట్టుకతోనే తన మేనకోడలిని పెళ్ళి చేస్కొనే హక్కు వస్తుంది. నేపాల్లో కొన్ని తెగలలో పుట్టిన పురుషులకు కూడా ఇటువంటి హక్కు వుంటుంది.

బ్రాహ్మణులలో స్వగోత్రీయుల మధ్య వివాహాన్ని ఒప్పుకోరు. స్వగోత్రీయులంతా ఒకే పురుషుడి నుంచి తర తరాలుగా ఉద్భవించిన వారయి వుంటారు. దీనివల్ల తండ్రికి సంబంధించిన చుట్టాలమధ్య అంటే దాయాదులమధ్య పెళ్ళిళ్ళు జరిగే అవకాశం చాలామట్టుకు నివారింపబడుతోంది. ఇంకొన్ని జాతులలో తల్లి (ఒకే స్త్రీ) తరపు చుట్టాలమధ్య వివాహ సంబంధాలను వ్యతిరేకిస్తారు. బాలిహిందువులలో (ఇండొనీసియలో)


***Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.***

గోత్రాలను 'దాదియా'అని పిలుస్తారు. అయితే బ్రాహ్మణసిద్ధాంతాలకు విరుద్ధంగా స్వగోత్రీయులలో (స్వదాడియాలలో) మాత్రమే బాలిహిందువులు వివాహాలు చేస్తారు!

కేరళకు చెందిన కురుచియన్లూ, తమిళ నాడుకు చెందిన పెరియార్లూ కూడా మేనరికపు పెళ్ళిళ్ళ పైపే మొగ్గుచూపుతారు. చైనాలో కొన్ని రకాల మేనరికాలను అంగీకరించినప్పటికీ, కొన్ని రకాల మేనరికపు పెళ్ళిళ్ళను పూర్తిగా నిషేదించారు.

గ్రామీణ ప్రాంతాలలో మేనరికపు పెళ్ళిళ్ళు ఎక్కువ. తురకవారిలో కూడా ఈ మేనరికాలు ఎక్కువే. భారతదేశంలోనూ, భారతఖండములోనూ కూడా మేనరికాలను ఎక్కువగానే గమనించవచ్చు. భారతఖండములో సుమారు ౫౦ కోట్లకు పైగ తురక ప్రజలున్నారు –ప్రపంచములోని తురక ప్రజల జనాభ లో సగానికి పైఅగ నే ఉన్నరు. అరబ్బు దేశాలలో సగానికిపైగా మేనరికాలే! ప్రపంచం మొత్తం మీద జరుగుతున్న వివాహాలను పరిశీలిస్తే, ఇరవై శాతానికి పైగా పెళ్ళిళ్ళు రక్తసంబంధీకుల మధ్యనే జరుగుతున్నాయి అంటే ఆశ్చర్యంగా వుంటుందికదూ!

విశాలదృక్పధంతో ఆలోచిస్తే మానవులదంతా ఒకటే జాతి కదా! అంటే అందరం ఏదో ఒక విధంగా రక్త సంబంధీకులమే! కానీ సూక్ష్మ దృష్టితో అలోచిస్తే, స్వంత సంతానం తర్వాత అంతటిదగ్గర రక్తసంబంధీకులు – అన్నదమ్ముల, అక్కచెల్లెళ్ళ పిల్లలే! శాస్త్రదృష్ట్యా ఆలోచిస్తే, అప్పుడప్పుడూ అక్కడక్కడా అయ్యే మేనరికాల వల్ల పుట్టబోయే సంతానానికి హాని వుండకపోవచ్చు. వున్నప్పటికీ స్వల్ప హానే జరగ వచ్చు. తెలుగు సంప్రదాయాలలో మేనరికాలను గర్హించక పోవడానికి కొన్ని కారణాలు లేక పోలేదు. మేనరికాల వల్ల కుటుంబవ్యవస్థ బలీయంగా వుంటుంది. చాలా జాతులలో, తెగలలో కుటుంబ వ్యవస్థకూ ఆర్ధిక, ఆస్థి వ్యవహారాలకూ చాలా అవినాభావ సంబంధము ఉంది! అయినప్పటికీ ఒకే కుటుంబములో జరిగే వరుస మేనరికాలవల్ల, పిల్లలకు కలిగే హాని గురించి తెలుగు సంప్రదాయాలు నొక్కి మరీ వక్కాణిస్తున్నాయి!

అమెరికాలో ప్రధాన మతము క్రైస్తవ మతము, అత్యధిక జనాభ యూరపు నుంచి వలస వచ్చినవారు కాబట్టి, ముప్ఫైయొక్క రాష్ట్రాలలో మేనరికాలను నిషేదిస్తూ చట్టాలు వున్నాయి. పంతొమ్మిది రాష్ట్రాలలో మట్టుకు మేనరికం మీద ఎటువంటి చట్టాలూ లేవు. కొన్ని రాష్ట్రాలు ఎప్పుడో జరిగిపోయిన మేనరికపు వివాహాలకు మినహాయింపునిచ్చాయి! ఆటన్హైమర్ మార్టిన్ (**Martin Ottenheimer**) రాసిన "నిషేదింపబడిన బంధువులు: మేనరికం పట్ల అమెరికన్ల నమ్మకాలు" ("ఫర్బిడెన్ రిలేటివ్స్: ది అమ్మెరికన్ మిథ్ ఆవ్ కజిన్ మారిజ్" **"Forbidden Relatives: The American Myth of Cousin Marriage"**) అనే పుస్తకంలో అమెరికా చట్టాల దృక్కోణంలో మేనరికపు వివాహాలు పరిశీలింప బడ్డాయి. షూమటాఫ్ ఆలెక్స్ (**Alex**



***Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.***

# శ్రీ వేపచేదు విద్యా పీఠము

# Vepachedu Educational Foundation, Inc.

## మన సంస్కృతి

## Mana Sanskriti

**Shoumatoff)** రాసిన "పేరుల దిబ్బ" ("ద మౌంటెన్ ఆవ్ నేంస్" **"The Mountain of Names")** లో కూడా మేనరికవివాహాలలోని మంచిచెడ్డలు సవివరంగా చర్చింపబడ్డాయి. యూరపులో మేనరికాలు చాల తక్కువ. అందుకే అక్కడ వీటిపై చట్టాలు రూపొందించ వలసిన అవసరము లేదు.

స్టాన్ఫర్డ్ విస్వవిద్యాలయము **(Stanford University)**, నాషనల్ సొసైటి ఆఫ్ జెనెటిక్ కౌంసెలర్స్ **(The National Society of Genetic Counselors)** కు చెందిన శాస్త్రజ్ఞులు–ఉత్తరమెరికా, ఆఫ్రికా, ఆసియా, అరబ్బు దేశాలలోని మేనరికపు వివాహాల ద్వారా పుట్టిన పిల్లల ఆరోగ్య పరిస్థుతులపై రెండు సంవత్సరాలకు పైబడి పరిశోధన నిర్వహించి, గణాంకాలతో సహితము ఒక సమగ్ర నివేదికను తయారు చేసారు! శాస్త్రజ్ఞులు మేనరికపు వివాహల ద్వారా పుట్టిన పిల్లలో ౭%–౮% **(7% - 8%)** జన్యు దోషాలుండగా, మాములు వివాహాల ద్వారా పుట్టిన పిల్లలలో ౫% **(5%)** జన్యు దోషాలున్నాయి నిరూపించారు. ఏప్రిల్ ౨౦౦౨ **(April, 2002)** లో విడుదలైన ఈ నివేదిక ప్రకారము –చాలమంది వైద్యులూ, శాస్త్రజ్ఞులూ మేనరికవివాహాలను ఖండించడం మానేసారు. ఎటొచ్చీ– మేనరికాలలో వివాహానికి ముందే జన్యు దోషాలు లేకుండా జాగ్రత్తలు తీస్కోమ్మని మాత్రం చెప్తున్నారు!

బరహ–ఉచిత కన్నడ/దేవనాగరీ తంత్రాంశ గురువారం, మార్చి ౧౭, ౨౦౦౫

వంశపారంపర్యంగా వచ్చే జన్యు దోషాలను లెక్కిస్తే, ౫౦౦౦ **(5000)** కు పైగా జన్యు దోషాలు –మేనరికము కాకపోయినప్పటికీ –సంతానానికి సంక్రమించే అవకాశాలున్నాయి. కాబట్టి ఈ దోషాలు మేనరికంవల్ల పిల్లలకు సంక్రమించే అవకాశాలు చాలా ఎక్కువ వుంటాయనే వాదన కూడా వుంది. కానీ ఆ వాదనకు శాస్త్రపరంగా తగిన బలం లేదు.

మేనరికాలవల్ల హాని లేకపోయినప్పటికీ, కేవలం మేనరికాలే కాదు, రక్త సంబంధాలేకాదు, ఒకే కులము, తెగలోని వివాహాలను కూడా ఖండిస్తూ; వివిధ దేశాలు, మతాలు, కులాలు, తెగల మధ్య వివాహాలను ప్రోత్సహించితే "వసుధైక కుటుంబము" సాధ్యమయ్యే అవకాశముంది!

ప్రామాణిక ఆంగ్లమూల రచన: మన సంస్కృతి, వేపచేదు శ్రీనివాసరావు

(http://www.vepachedu.org/manasanskriti/menarikam.html)

* * *


***Copyright © 1998-2005 Vepachedu Educational Foundation, Inc. USA. All rights reserved.***